క్లుప్తంగా

16వ ఆర్థిక సంఘం బృందానికి సాదర స్వాగతం



చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న కలెక్టర్

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం 16వ ఆర్థిక సంఘం చైర్మన్ డా.అరవింద్ పనగారియా సభ్యులతో కూడిన బృందం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. వీరితో పాటు ఏపీ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, అడిషనల్ సెక్రటరీ జె.నివాస్ బృందంలో ఉన్నారు. వారికి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, సంయుక్త కలెక్టర్ శుభం బన్సల్, కమిషనర్ ఎన్.మౌర్య, ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి, తహసీల్దార్ సురేష్ బాబు సాదరంగా స్వాగతం పలికారు.

భూముల రీసర్వే ప్రారంభం



భూముల రీసర్వే చేస్తున్న ఆర్ఎస్‌డీటీ చంద్రబాబు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని తిమ్మభూపాలపురం గ్రామ రెవెన్యూలో గురువారం భూముల రీసర్వేను ఆర్ఎస్ డీటీ చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిమ్మభూపాలపురం గ్రామంలో 384.98 ఎకరాలు, చల్లమాంబపురంలో 265.55 ఎకరాల భూమిని రీ సర్వే చేస్తామని తెలిపారు. ఇప్పటికే రెండు గ్రామాల సరిహద్దులను గుర్తించి రాళ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భూముల రీసర్వేతో భూసమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సర్వే అధికారులు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ రాజ్‌కుమార్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా రోడ్డు తవ్వకాలు



చిన్న పాండూరు సమీపంలోని రోడ్డుకు అడ్డంగా మట్టి కుప్పలు

వరదయ్యపాళెం : గ్యాస్ పైపులైన్ ఏర్పాటు కోసం ఆర్‌అండ్‌బీ రోడ్ల వెంట ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తున్నారు. కనీస భద్రతా ప్రమాణాలు లేకుండా రోడ్డులో సగం వరకు మట్టి కుప్పలు పోసి రోజుల తరబడి అలాగే వదిలేస్తున్నారు. దీంతో వాహనాలు ఎదురెదురుగా వెళ్లేందుకు వీలులేకుండా ఉంది. ఈ పరిస్థితి కడూరు కూడలి నుంచి చిన్నపాండూరుకు వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గంలో నెలకొంది. రోడ్ల పైన వేసిన మట్టి కుప్పలను తొలగించకపోవడంతో రాత్రివేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామాల వద్ద పంచాయతీ కొళాయిలకు నీటి సరఫరా అయ్యే పైపులైన్లను ధ్వంసం చేస్తూ ప్రజల దాహార్తికి అడ్డంకులు సృష్టిస్తున్నారు. బాగున్న రోడ్లు సైతం ధ్వంసం చేస్తున్నారు.

గురువులకు విలువ కట్టలేం



డిప్యూటీ ఈవో ప్రభాకర్‌రాజును సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం : భవిష్యత్తుకు బాటలు వేసే గురువులకు విలువ కట్టలేమని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. పుత్తూరు డిప్యూటీ ఈవో, నారాయణవనం ఎంఈవో ప్రభాకర్‌రాజు పదవీ విరమణ సభ స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో గుణశేఖర్ అధ్యక్షతన జరిగింది. జడ్పీటీసీ సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంఈవో ప్రభాకర్‌రాజు సేవలను కొనియాడారు. సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్య, తహసీల్దార్ జయరాములు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు సారకాయలు(నారాయణవనం), అపరింజిరాజు(నాగలాపురం), సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ మండలాల ఎంఈవోలు, విశ్రాంతి ఎంఈవోలు, పాల్గొన్నారు.

దాయాదుల ఘర్షణ

శ్రీకాళహస్తి : బాబాయిపై అన్న కుమారుడు దాడి చేసిన ఘటన శ్రీకాళహస్తి మండలం బీవీపురంలో గురువారం చోటు చేసుకుంది. బాధితుడు లక్ష్మయ్య కథనం మేరకు లక్ష్మయ్యకు తన అన్న కుటుంబంతో విభేదాలు ఉన్నాయి. ఈ క్రమంలో గురువారం అన్న కుమారుడు, వదిన లక్ష్మయ్యతో వాగ్వాదానికి దిగారు. వారు కర్రలు, రాళ్లతో దాడి చేశారు. గాయపడిన లక్ష్మయ్య శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. జరిగిన ఘటనపై శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గ్రాసం.. గోస

ఒకప్పుడు పశుగ్రాసానికి నిలయాలైన పల్లెల్లో నేడు పశుగ్రాసం కొరత వేధిస్తోంది. సరిపడేంత పశుగ్రాసం అందుబాటులో లేకపోవడంతో పశుపోషకులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పశుగ్రాసం కొరతతో పశువుల పోషణ భారంగా మారిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతులు, పశుపోషకులు ఇతర ప్రాంతాల నుంచి పశుగ్రాసాన్ని అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఫలితంగా రైతులపై అదనంగా ఆర్థిక భారం పడుతోంది.

- మండుతున్న వరిగడ్డి ధరలు
- ట్రక్కు వరి గడ్డి రూ.12 నుంచి రూ.16 వేలపైనే
- ఏడాదిలో రూ. 6 వేలు పెరిగిన వైనం
- పాడి రైతులకు తప్పని కష్టాలు



వరిగడ్డిని ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ : పశుగ్రాసం కొరతతో పాడి రైతులు పరేషాన్ అవుతున్నారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పశుగ్రాసం కొరత కారణంగా ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పెరిగిన ధరలతో పశుగ్రాసం కొనుగోలు చేయలేక పశువులను పెంచడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో పశుగ్రాసం సాగుకు ఎలాంటి నీటి ఆధారం లేకపోవడంతో వర్షాలపై ఆధారపడి బోర్లు, బావుల కింద పంటలు సాగు చేస్తారు. ఏటా వివిధ రకాలైన గ్రాసం పైర్లను సాగు చేసేవారు. కానీ ఈ ఏడాది ఆ పరిస్థితి లేదు. దీంతో గ్రాసం కొరత ఏర్పడి పశుపోషకులు కష్టాలు పడుతున్నారు. మండలంలో తెల్లజాతి పశువులు 2000, గేదెలు 7000 వరకు ఉన్నాయి. ప్రస్తుతం వేసవి కావడంతో పచ్చిక దొరక్క పశుపోషకులు అల్లాడిపోతున్నారు. ఈ క్రమంలో ఎండుగడ్డి సైతం ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో మూగ జీవాల పోషణ భారంగా మారడంతో అధిక శాతం మంది గ్రాసం కొనలేక పశువులను తెగ నమ్ముకుంటున్నారు.

ట్రక్కు రూ.16 వేలకు పైనే

ఈ ఏడాది గ్రాసం ధర ఆకాశాన్ని అంటుతోంది. గత ఏడాది రూ.10 వేలు నుంచి రూ. 12 వేలు పలకగా ఈ ఏడాది ట్రక్కు వరి గడ్డి రూ.14 వేల నుంచి 16 వేల వరకు పలుకుతోంది. దీనికి తోడు ట్రక్కుకు వేసినందుకు కూలీ ఖర్చులు రూ. 3 వేలు అదనంగా అవుతోంది. ఎండుగడ్డిని కొనాలంటే పాడి రైతులు జంకుతున్నారు. ప్రస్తుతం పాల ధరలు తక్కువగా ఉండటం, గ్రాసం దొరక్కపోవడం, దొరికినా అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి రావడంతో పశుపోషకులు పశువులను వదిలించుకునే పరిస్థితులు దాపురించాయి.

అలంకారప్రాయంగా పథకాలు

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో పశుగ్రాసం అధిగమించి రైతులను ఆదుకునేందుకు ఉపాధి హామీ పథకంలో పశుగ్రాసం పెంపకాన్ని ప్రవేశపెట్టి పశుపోషకులను ప్రోత్సహించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు రాయితీపై విత్తనాలను పంపిణీ చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అవేవీ పట్టించుకోకపోవడంతో పశుపోషకులు ఇబ్బందులు పడుతున్నారు.

గడ్డి కోసం వేరే ప్రాంతాలకు..



మండలంలో ఎక్కడ చూసినా పశుగ్రాసం కొరతే. ఎన్ని గ్రామాలు తిరిగినా పశుగ్రాసం దొరకడం లేదు. దీంతో వేరే ప్రాంతాలకు వెళ్లి గడ్డి కొనుగోలు చేస్తున్నాం. వారం నుంచి పది రోజుల పాటు ఎండుగడ్డి సేకరణ కోసమే సమయం వెచ్చించాల్సి వస్తోంది. ఎండు గడ్డి ధరలు విపరీతంగా ఉండడంతో విధి లేని పరిస్థితుల్లో గొర్రెలను అమ్మేశా. రెండు గేదెలను మాత్రమే ఉంచుకొని జీవనం సాగిస్తున్నా. – **మునెయ్య, కరకంబట్టు గ్రామం**

గేదెలను అమ్మేశా..



నాకు ఆరు గేదెలు ఉండేవి. పచ్చి గడ్డి ఎక్కడా దొరకడం లేదు. ఎండు గడ్డి కొనుగోలు చేద్దామంటే ధరలు విపరీతంగా ఉన్నాయి. ట్రక్కు ఎండుగడ్డి రూ.16 వేలు చెబుతున్నారు. కూలీ , తిండి ఖర్చులు కలిపితే మొత్తం రూ.20 వేలు అవుతోంది. ఇంత ధర పెట్టి ఎండుగడ్డి కొనలేక కొన్నింటిని అమ్మేశా. మిగిలిన వాటిని ఎలాగోలా బతికించుకుంటున్నా. ప్రభుత్వం ఉచితంగా పశుగ్రాసం అందించి ఆదుకోవాలి. – **లక్ష్మీపతిరెడ్డి, కాటూరు గ్రామం**

నోటీస్ బోర్డు

నేడు ఎమ్మెల్యే సత్యవేడు పర్యటన

సత్యవేడు : ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శుక్రవారం సత్యవేడులో పర్యటిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పీవిపురంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయం మహా కుంభాభిషేక పూజల్లో పాల్గొననున్నారు. మోటుపాలెం, చమర్తి కండ్రిగల్లో సిమెంటు రోడ్డును ప్రారంభించనున్నారు.

19న ఉచిత వైద్యశిబిరం

వరదయ్యపాళెం : మండల కేంద్రమైన వరదయ్యపాళెంలో నైస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సహకారంతో ఈనెల 19న తిరుపతికి చెందిన స్విమ్స్ ఆస్పత్రి వారిచే ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నైస్ స్కూల్ కరస్పాండెంట్ మోహన్ తెలిపారు. నైస్ స్కూల్ ప్రాంగణంలో ఈనెల 19 ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు శిబిరం జరగనున్నట్లు వారు వివరించారు. ఈ శిబిరంలో గుండె, నరాలు, గైనకాలజీ, కిడ్నీలు, డయాబెటీస్ వ్యాధులకు సంబంధించి వైద్యం చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

ప్రజలతో మాటామంతి



అవగాహన కల్పిస్తున్న సీఐ గోపి

శ్రీకాళహస్తి : పట్టణంలో గురువారం రాత్రి 1వ పట్టణ సీఐ గోపి వాటర్‌హౌస్ కాలనీలో ప్రజలతో మాటా మంతి నిర్వహించారు. ఈ ప్రాంతంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీసు సేవలను మరింత చేరువయ్యే విధంగా పలు సూచనలు ఇచ్చారు. చట్టాలు, సైబర్‌క్రైమ్, చిన్న పిల్లలు, మహిళల పట్ల జరిగే నేరాలను వారికి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పంపిణీ చేశారు.

ముగిసిన చీరాలమ్మ జాతర





గుట్టపై కొలువుతీరిన చీరాలమ్మ దేవత, కృష్ణాపురంలో గ్రామోత్సవం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : చీరాలమ్మ జాతర మహోత్సవాలు గురువారం గ్రామోత్సవంతో ముగిశాయి. రేణిగుంట మండలం కృష్ణాపురం సమీపంలోని తిప్పపై వెలసిన చీరాలమ్మ జాతర సందర్భంగా గురువారం తెల్లవారుజామున సంప్రదాయం ప్రకారం కృష్ణాపురం సర్పంచ్ కుమార ముద్దు రాయలు ఇంటి నుంచి అమ్మవారి గెరిగా, పసుపు కుంకుమ, సారే, పొంగళ్లను ఊరేగింపుగా గుట్టపైకి తీసుకెళ్లి అమ్మవారికి తొలిపూజ చేశారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించారు. అనంతరం అమ్మవారి పసుపు, కుంకుమను తీసుకొచ్చి కృష్ణాపురం పాతూరు, కొత్తూరు గ్రామాల్లో గంగమ్మ రాయి వద్ద అమ్మవారి ప్రతి రూపాన్ని తీర్చిదిద్ది గంగమ్మ జాతరను జరుపుకున్నారు. సాయంత్రం గ్రామాలలో అమ్మవారి గ్రామోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.



ఆగమోక్తంగా హోమం

శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజి వినాయకస్వామి ఆలయం వద్ద గురువారం ఆగమోక్తంగా సంకట చతుర్థి పూజలు నిర్వహించారు. ఈ పూజలను ప్రతి కుటుంబం నిర్వహించుకునే విధంగా ఈ పూజలను ఆర్జిత సేవగా తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించారు.

– శ్రీకాళహస్తి

బడి బయట పిల్లల గుర్తింపు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలో పాఠశాలకు వెళ్లకుండా బడి మానేసి, బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని మండల విద్యాశాఖాధికారులు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగలోని ఎమ్మార్సీలో గురువారం మోడల్ ప్రైమరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. 3,4,5 తరగతులు ఏ ప్రైమరీ స్కూల్‌కు మెర్జ్ అవుతున్నాయో, ఆయా పాఠశాలలలోని ప్రధానోపాధ్యాయులు పిల్లలను జాయిన్ చేయించుకుని, 21, 22, 23 తేదీలలో వారికి సంబంధించిన తరగతుల్లో కూర్చోబెట్టాలని సూచించారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురు దక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్య



ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరుతున్న ఉపాధ్యాయులు

రేణిగుంట : ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉచిత, నాణ్యమైన విద్య పిల్లలకు అందుతుందని, తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఓబులాయపల్లి హైస్కూల్ హెచ్‌ఎం సాదిక్ బాషా కోరారు. శ్రీకాళహస్తి మండలం ఓబులాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాల కోసం గురువారం ఉపాధ్యాయ బృందం సమీప గ్రామాలైన ఎర్రమరెడ్డిపల్లి, రెడ్డిపల్లి, ఓబులాయిపల్లి గిరిజన కాలనీలలో పర్యటించి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ఆరో తరగతిలో పిల్లలను చేర్చాలని కోరారు. ఈ సందర్భంగా 15 మంది విద్యార్థులను 6వ తరగతికి అడ్మిషన్లు తీసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రగతి స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్, సీఆర్‌పీ కె.ధనశేఖర్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



శ్రీకాళహస్తి : ఉమాపతి కుటుంబంతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి : పట్టణంలో గురువారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పలువురిని కలిశారు. అందులో భాగంగా 4వ వార్డు వైఎస్సార్‌సీపీ నేత ఉమాపతి ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అక్కడికి చేరుకుని వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం సీనియర్ పాత్రికేయులు రహంతుల్లా సతీమణి కర్మక్రియలకు హాజరయ్యారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పోలస్వామి షణ్ముగం, నాయకులు సురా సురేష్, కంఠా ఉదయ్‌కుమార్ గణేష్, శరవణ, శంకర్, పసల కృష్ణయ్య, పఠాన్ ఫరీద్, రాజశేఖర్, సుధాకర్ పాల్గొన్నారు.

గాజులమండ్యంలో..

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట మండలంలోని గాజులమండ్యం గ్రామానికి చెందిన మల్లం శంకర్ రెడ్డి మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి గురువారం నివాళులర్పించారు. ఆయన వెంట పన్నీరుకాల్వ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ గంగారి రమేష్, ఎంపీటీసీ వెంకటరమణారెడ్డి, మునిశేఖర్ రెడ్డి, బెనర్జీ పాల్గొన్నారు.

లాప్రోస్కోపీ విప్పిల్స్ శస్త్రచికిత్స విజయవంతం



డిశ్చార్జ్ అయిన రోగితో డాక్టర్ల బృందం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : మునికృష్ణయ్య అనే 60 సంవత్సరాలు గల వ్యక్తి రెండు నెలలుగా కడుపు నొప్పి, కామెర్లతో బాధపడుతున్నారు. ఈక్రమంలో రేణిగుంట సమీపంలోని అమరా ఆసుపత్రిలోని సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో ఆయన వైద్య సహాయం తీసుకున్నారు. డాక్టర్ మునికృష్ణ పరీక్ష చేసిన తర్వాత ఆయనకు ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ చేశారు. రోగి తరువాత లాప్రోస్కోపిక్ ప్యాంక్రియాటోడ్యూడెనెక్టమీ (విప్పిల్స్ ప్రక్రియ) చేయించుకున్నాడు. ఇది అత్యంత సంక్లిష్టమైన, అధునాతన శస్త్రచికిత్సా విధానమని డాక్టర్లు తెలిపారు. ఈ శస్త్ర చికిత్సను డాక్టర్ మునికృష్ణ, అతని బృందం నైపుణ్యంగా నిర్వహించారు. ఈ ప్రక్రియ విజయవంతమైంది. రోగి గురువారం డిశ్చార్జ్ అయ్యాడు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గొరినేని రమాదేవి మాట్లాడుతూ.. చుట్టుపక్కల జిల్లాలో అందుబాటులో లేని లాప్రోస్కోపిక్ విప్పిల్స్ శస్త్ర చికిత్స ఇప్పుడు అమరాలో అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.

ముత్యాలమ్మ వైభవం



శ్రీకాళహస్తి పట్టణంలోని ముత్యాలమ్మ ఆలయంలో గురువారం జాతర వైభవంగా నిర్వహించారు. మంగళవారం నుంచి ప్రారంభమైన జాతర వేడుకలు గురువారం ముగిశాయి. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. ఉదయం ముత్యాలమ్మ గంగపెట్టెను, రాత్రి అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఈఓ. బాపిరెడ్డి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

– శ్రీకాళహస్తి

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

శ్రీకాళహస్తి : అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. గ్యాస్, ఆయిల్ , ఎలక్ట్రికల్ ఫైర్ అయిన సందర్భంగా ఎలాంటి నివారణ చర్యలు తీసుకోవాలో ప్రదర్శించి చూపించారు. అదే విధంగా పై అంతస్థులో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు, పొగ దట్టంగా అలుముకున్న సమయంలో ఎలా కాపాడాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంజీఎం పాఠశాల డైరెక్టర్ గుడ్లూరు మయూర్, అగ్నిమాపక ఇన్‌చార్జి అధికారి నాగార్జునరెడ్డి, సిబ్బంది తిరుమలరెడ్డి, సునీల్, అమర్‌నాథ్‌రెడ్డి, ధనశేఖర్, రాజా, మునిశేఖర్, రంజిత్‌కుమార్, మహేశ్వరరెడ్డి, విజయకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట నష్టం

బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని వెస్టువరత్తూరులో బుధవారం రాత్రి కురిసిన అకాల వర్షంతో రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ఒక్కసారిగా అకాల వర్షం ఈదురుగాలులతో విరుచుకుపడింది. దీంతో 5 ఎకరాల్లోని కాకర పంట దెబ్బతింది. కాకర చెట్ల కోసం వేసిన పందిళ్లు గాలీ వానతో నేలకూలాయి. 20 ఎకరాల్లోని మామిడి కాయలు నేలరాలాయి.

– బుచ్చినాయుడుకండ్రిగ



పొంచి ఉన్న ప్రమాదం



కృష్ణ తేజ కాలేజ్ ఎదురుగా అండర్ డ్రైనేజ్ పైకప్పు దెబ్బతినడంతో ఏర్పడిన గుంత

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : తిరుపతి- రేణిగుంట ప్రధాన రహదారి అండర్ డ్రైనేజ్ పనులు అస్తవ్యస్తంగా మారాయి. డ్రైనేజ్ పై కప్పు డామేజ్ అవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అధికారులు తాత్కాలిక పనులు చేస్తూ ప్రభుత్వ ధనాన్ని వృథా చేస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడంలో వైఫల్యం చెందుతున్నారు. ప్రతిరోజు ఏదో ఒక చోట తాత్కాలిక పనులు చేస్తూ వన్‌వేగా ఉన్న ప్రధాన రహదారిలో వాహనాలను ఒకే వైపు మళ్లించడంతో నిత్యం ట్రాఫిక్ కష్టాలు ఏర్పడుతున్నాయి.అండర్ డ్రైనేజ్ పై కప్పు పనులు చేసి రోడ్డు పైనే మట్టి వదిలేయడంతో వాహనాల రాకపోకల సమయంలో దుమ్ము విపరీతంగా వ్యాపించి ద్విచక్ర వాహనాలలో వెళ్లే వాళ్లకు తీవ్ర సమస్యగా ఉంది.